సాక్షి
విశాఖపట్నం
3
బుధవారం । 22 । మార్చి । 2023



ఆరోగ్య'యోగ'ం
యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కమిషనర్ పి.రాజాబాబు అన్నారు. 4లో



బీచ్ కారిడార్‌కు 'గ్రీన్' కార్పెట్
భోగాపురం విమానాశ్రయానికి సాఫీగా చేరుకునేలా ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 4లో



రూ.75కి టీటీడీ పంచాంగాలు
టీటీడీ అందుబాటులోకి తెచ్చిన తెలుగు పంచాంగాలను రూ.75కు విక్రయిస్తున్నట్లు దేవస్థానం మేనేజర్ వెల్లడించారు. 4లో

న్యూస్‌రీల్

24న స్థాయీ సంఘ సమావేశం



డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 24న సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నారు. సమావేశంలో 34 అంశాలపై సభ్యులు చర్చించనున్నారని కార్యదర్శి పి.నల్లనయ్య తెలిపారు. అలాగే 2023–24 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమావేశం ఈ నెల 25న నిర్వహించనున్నారు. వాస్తవానికి గత నెల 15న బడ్జెట్ సమావేశం నిర్వహించాల్సి ఉండగా, పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేశారు. 25న నిర్వహించనున్న ప్రత్యేక బడ్జెట్ సమావేశానికి సభ్యులు హాజరు కావాలని కార్యదర్శి కౌన్సిల్ సభ్యులను కోరారు.

రేపటి నుంచి దూరవిద్య బీఎస్సీ ప్రాక్టికల్ పరీక్షలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో బీఎస్సీ మూడో సంవత్సరం డిగ్రీ ప్రాక్టికల్స్, పర్సనల్ కాంటాక్ట్ తరగతులను ఈ నెల 23వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వర రావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 25 కేంద్రాల్లో 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించిన బీఎస్సీ చివరి సంవత్సరం వార్షిక ప్రాక్టికల్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. బ్యాక్‌లాగ్ ఉన్నవారు కూడా, నిర్ణీత ఫీజు చెల్లించి పరీక్షకు హాజరు కావచ్చని తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల విద్యార్థులు శ్రీకాకుళం హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాలలో, బీవీకే డిగ్రీ కళాశాల విద్యార్థులు విశాఖ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం 0891–2754966లో సంప్రదించాలని సూచించారు.

నేడు అర్చకులకు ఉగాది పురస్కారాలు

మహారాణిపేట: పలు ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు శోభకృత్ నామ సంవత్సర ఉగాది పురస్కారాలు–2023 ఇవ్వాలని దేవదాయశాఖ నిర్ణయించింది. ఈ అవార్డులకు సీనియర్ అర్చకులు కొత్తలంక మురళీకృష్ణ, దొంతుకుర్తి సుబ్బారావు, వేదపండిట్ కాండూరి శ్రీనివాసరావును ఎంపిక చేసినట్టు దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ కె.శిరీష తెలిపారు. వీరికి బుధవారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ ఎ.మల్లికార్జున ఉగాది పురస్కారాలు అందజేస్తారు. అలాగే టర్నర్ సత్రం ఆవరణలోని కల్యాణ మండపంలో మధ్యాహ్నం 3 గంటలకు పలు ఆలయాల్లో పనిచేస్తున్న 14 మంది అర్చకులను సన్మానించనున్నట్లు శిరీష తెలిపారు. పి.ప్రకాశ్‌శాస్త్రి, బాదంపూడి విశ్వేశ్వరరావు, శ్రీనివాస చక్రవర్తి, కె.విజయకుమార్, బి.సత్యనారాయణ, బైరవబొట్ల శ్రీనివాసమూర్తి, సోమేశ్వరరావు, రామానుజాచార్యులు, జి.సింహం, జి.వి.చంద్రమౌళి, పి.జగన్నాథాచార్యులు, ఎస్.కామేశ్వర రావు, రామారావుశర్మ, డి.రాజాస్వామిలను సత్కరిస్తామన్నారు.

విశాఖ ఉక్కుకు ఆస్తిపన్ను నోటీసు



ఉక్కు సీఎండీకి నోటీసును అందజేస్తున్న జెడ్సీ సింహాచలం

గాజువాక : ఆస్తిపన్నుపై రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ మాఫీని ప్రకటించిన నేపథ్యంలో జీవీఎంసీ గాజువాక జోనల్ అధికారులు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఆస్తి పన్ను నోటీసును అందజేశారు. గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం ఆధ్వర్యంలో అధికారులు స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్‌ను మంగళవారం కలిసి నోటీసును అందజేశారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా ఆస్తి పన్ను బకాయిలను చెల్లిస్తే మొత్తం వడ్డీ మాఫీ అవుతుందని వివరించారు. తద్వారా స్టీల్‌ప్లాంట్‌కు లభించే ప్రయోజనాన్ని తెలిపారు.

ఉగాది ఉషస్సు

సంప్రదాయ సొగసు.. ఉగాది ఉషస్సు.. మహా నగరానికి సరి'కొత్త' కాంతులద్దింది. పచ్చి మామిడికాయలు, చెరకు గడలు, కొత్త బెల్లం, చింతపండు, వేప పూతల కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడాయి. కొత్త దుస్తులు ఖరీదు చేసే వినియోగదారులతో వ్యాపార సముదాయాలు కిటకిటలాడాయి. ఉగాది పచ్చడి తయారు చేసేందుకు అవసరమైన కొత్త కుండల కోసం జనాలు ఎగబడ్డారు. నగరంలోని పలు చోట్ల పూలు, పండ్ల సముదాయాలు వెలిశాయి. పంచాంగం పుస్తకాలను కొనుగోలు చేయడానికి పండితులు ఆసక్తి చూపారు.

ఫొటోలు: సాక్షి, ఫొటోగ్రాఫర్,విశాఖపట్నం



కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న పూర్ణామార్కెట్





ప్రజలందరికీ మంచి జరగాలి
మేయర్, కమిషనర్ ఆకాంక్ష

డాబాగార్డెన్స్: శోభకృత్ నామ సంవత్సరంలో నగర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆకాంక్షించారు. ఈ సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని, విశాఖ నగరం మరింత అభివృద్ధి సాధించాలన్నారు. నగర ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

28న ముఖ్యమంత్రి రాక

- జీ–20 సదస్సు ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- అదే రోజు రాత్రి అతిథులతో గాలా డిన్నర్
- 27న 80 మంది విదేశీ అతిథుల రాక
- పక్కాగా ఏర్పాట్లు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: జీ–20 అంతర్జాతీయ సదస్సు ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 28న నగరానికి రానున్నారని కలెక్టర్ డా.మల్లికార్జున వెల్లడించారు. అదే రోజు రాత్రి దేశ, విదేశీ అతిథులతో గాలా డిన్నర్‌లో సీఎం పాల్గొంటారని తెలిపారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో మంగళవారం జీ–20 సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జీ–20 సదస్సుకు వచ్చే అతిథులకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. విశాఖ వేదికగా ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు వివిధ దేశాలకు చెందిన అతిథులు రానున్నారని.. వారికి విమానాశ్రయంలో స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అతిథులు బస చేసే హోటళ్ల వద్ద 24/7 హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ హెల్ప్‌డెస్క్‌లో రెవెన్యూ, జీవీఎంసీ, మెడికల్, టూరిజం శాఖలకు సంబంధించిన సిబ్బంది మూడు షిఫ్ట్‌లుగా పనిచేసేలా పని విభజన చేయాలని సూచించారు. జీవీఎంసీలో కంట్రోల్ రూమ్ నిరంతరం పని చేయాలని జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుకు సూచించారు. నగర సుందరీకరణ పనులపై జీవీఎంసీ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రత్యేక శానిటైజేషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. కేంద్ర మంత్రులు రాక సందర్భంగా వారికి బస, లైజన్ ఆఫీసర్లు, ఎస్కార్ట్, వాహనాలు, తదితర ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్‌వో శ్రీనివాసమూర్తిని ఆదేశించారు. 27న 80 మంది విదేశీ ప్రతినిధులు నగరానికి రానున్నారని కలెక్టర్ వెల్లడించారు. అధికారులందరూ వారికి కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించి జీ–20 సదస్సును విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, టూరిజం ఆర్డీ శ్రీనివాస్‌పాణి, అధికారులు పాల్గొన్నారు.

డోర్ టు డోర్ కార్గో సేవలు

- ఉగాది నుంచి అమలుకు సన్నద్ధం
- షిప్‌మంత్ర లాజిస్టిక్స్‌తో ఆర్టీసీ ఒప్పందం
- ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయం
- ప్రైవేటు పార్సిల్ సంస్థలకంటే తక్కువ డెలివరీ చార్జీలు



విశాఖ ద్వారకా బస్‌స్టేషన్‌లో పార్సిల్ రవాణా కార్యాలయం

సాక్షి, విశాఖపట్నం: కార్గో సేవల్లో ఆర్టీసీ దూకుడు ప్రదర్శిస్తోంది. ఇప్పటికే వినియోగదారుల ఆదరణతో దూసుకుపోతున్న ఈ కార్గో ఇప్పుడు వారికి మరింత చేరువకానుంది. ఉగాది నుంచి పార్సిల్స్, కొరియర్స్, 50 కిలోల లోపు బరువున్న సరకులు/వస్తువులను 20 కిలోమీటర్ల పరిధిలో డోర్ పికప్, డెలివరీ చేయడానికి సన్నద్ధమవుతోంది. ఇందు కోసం షిప్‌మంత్ర అనే లాజిస్టిక్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. తొలిదశలో ప్రయోగాత్మకంగా విజయవాడ–విశాఖపట్నం నగరాల మధ్య ఈ సేవలను అందుబాటులోకి తెస్తోంది. ఇకపై ఎవరైనా ఆర్టీసీ కార్గో ద్వారా పార్సిల్స్ లేదా కొరియర్ కవర్లను పంపాలనుకున్న వారు తమ ఇంటి నుంచే వాటిని 'షిప్‌మంత్ర ఆన్‌లైన్ బుకింగ్ పోర్టల్' ద్వారా బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తున్నారు. దీని ద్వారా డోర్ పికప్, డెలివరీ సదుపాయాన్ని పొందవచ్చు. ప్రారంభ కానుకగా ఈ నెల 31 వరకు మొదటి మూడు బుకింగ్‌లకు ఉచిత డోర్ పికప్, డోర్ డెలివరీ సౌకర్యాన్ని కార్గో వినియోగదారులకు ఆర్టీసీ యాజమాన్యం కల్పిస్తోంది. ఇలా సంబంధిత షిప్‌మంత్ర లాజిస్టిక్స్‌కు చెందిన వ్యక్తులు డోర్ పికప్, డెలివరీ సేవలందిస్తారు. వాటిని ఆర్టీసీ కార్గో బుకింగ్ కౌంటర్‌లో అందజేస్తారు. అక్కడ నుంచి నిర్ణీత ప్రాంతాలకు పంపిస్తారు. వాటిని ఏ బస్సులో పంపిస్తున్నారో ఆర్టీసీ కార్గో విభాగం నుంచి షిప్‌మంత్రకు పంపిస్తారు. అక్కడ నుంచి నిర్దేశిత చిరునామాకు డెలివరీ చేస్తారు. ఇందుకుగాను స్వల్పంగా రుసుము వసూలు చేస్తారు. వీటి చార్జీలను నేడో, రేపో ఖరారు చేయనున్నారు. కొత్తగా ప్రవేశపెడ్తున్న ఈ సదుపాయం వల్ల వినియోగదారునికి తక్కువ ఖర్చుతోనే తమ సరకులు/పార్సిళ్లను ఇంటి నుంచే పంపించుకునే వెసులుబాటు కలుగుతుంది.

కార్గో జోన్ లక్ష్యం రూ.64 కోట్లు

ఆర్టీసీ విజయనగరం కార్గో జోన్ పరిధిలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలున్నాయి. ఈ జోన్ కార్గో ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.21 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. కొత్తగా కార్గో డోర్ డెలివరీ సదుపాయాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో 2023–24 సంవత్సరానికి కార్గో రాబడి లక్ష్యం రూ.64 కోట్లుగా నిర్దేశించారు. ఇతర లాజిస్టిక్స్‌కంటే ఆర్టీసీ కార్గో రవాణా చార్జీలు తక్కువగా ఉండడం, డోర్ పికప్, డెలివరీ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొస్తుండడం లాజిస్టిక్స్ ఆదాయం పెరుగుతుందని ఆర్టీసీ వర్గాలు భావిస్తున్నాయి.

ఆదరణ లభిస్తుంది



ఉగాది నుంచి కొత్తగా ప్రవేశపెడుతున్న కార్గో డోర్ పికప్, డెలివరీ సదుపాయానికి మంచి ఆదరణ ఉంటుంది. ఇప్పటికే ఆర్టీసీ కార్గోపై వినియోగదారుల్లో విశ్వసనీయత ఉంది. రాష్ట్రంలో 24 గంటల్లోనే సరకును చేరవేయడం, ప్రైవేటు లాజిస్టిక్స్‌కంటే 25 శాతం తక్కువ.. 2016 నాటి చార్జీలే ఇప్పటికీ వసూలు చేయడం వంటివి ఆర్టీసీకి కలిసొచ్చే అంశం.

– కె.వెంకట్రావు, డీసీఎం, విజయనగరం జోన్

రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం

- జగనన్న గోరుముద్దలో మరో పౌష్టికాహారం రాగిజావ
- జిల్లా వ్యాప్తంగా ప్రారంభం
- కలెక్టరేట్‌లో విద్యార్థులకు రాగిజావ అందించిన కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్



మధురానగర్ విద్యార్థుల దరహాసం



కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ కల్యాణి

విశాఖ విద్య: ప్రభుత్వ విద్యార్థులకు జగనన్న గోరుముద్దలో రాగిజావ అందించే కార్యక్రమం మంగళవారం వేడుకగా ప్రారంభమైంది. కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఈ కార్యక్రమం ప్రారంభించారు. విద్యార్థులకు వారు రాగిజావ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో 587 పాఠశాలల్లో చదువుతున్న 87,861 మంది విద్యార్థులకు వారంలో మూడు రోజుల పాటు రాగి జావ అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు రాగిజావ ఎంతో దోహదపడుతుందన్నారు. విద్యార్థులకు పరిశుభ్రంగా రాగి జావ అందించేలా ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం ఓ వరంలాంటిదన్నారు. గతంలో తాను టీచర్‌గా పనిచేశానని, నాడు ఇటువంటి రుచికరమైన భోజనం విద్యార్థులకు అందలేదన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించగా.. కలెక్టరేట్ నుంచి విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని విద్యార్థులు శ్రద్ధగా విన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు జి.సీతారాం, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి, డీఈవో ఎల్. చంద్రకళ, మధ్యాహ్న భోజన పథకం అసిస్టెంట్ డైరక్టర్ ఎ.అరుణ జ్యోతి, ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ యు.మాణిక్యం నాయుడు, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వేడుక

రాగిజావ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలల్లో వేడుకగా నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు రాగిజావ అందించారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పాల్గొని విద్యార్థులకు రాగిజావ అందించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని మేయర్ పిలుపునిచ్చారు.



స్నేహితురాలికి రాగి జావ పెడుతున్న విద్యార్థిని

రాగిజావ ఎంతో బాగుంది



రాగిజావ తాగితే ఆరోగ్యంగా ఉండొచ్చని మా అమ్మ ఇంటి వద్ద చేసి ఇస్తోంది. ఎంతో ఇష్టంగా తాగుతాను. ఇంటి వద్ద కంటే బడిలో రాగి జావ ఎంతో రుచిగా ఉంది. మంచి భోజనంతో పాటు చిక్కీ ఇస్తున్నారు. ఇప్పుడు రాగి జావ ఇవ్వడం ఆనందంగా ఉంది.

– బి.దివ్యభారతి, ఎంవీడీఎం హైస్కూల్

తొలిసారి తాగుతున్నా..



రాగిజావ తొలిసారి తాగుతున్నా. ఎంతో బాగుంది. బడిలో మధ్యాహ్న భోజనం ఎంతో రుచిగా ఉంటుంది. ఇక నుంచి వారంలో మూడు రోజులు రాగిజావ ఇస్తారని బడిలో చెప్పారు. ఎంతో సంతోషంగా ఉంది.

– ఎ.రామలక్ష్మి, ఎంవీడీఎం హైస్కూల్, విశాఖ

షిప్‌యార్డుని సందర్శించిన నేవల్ స్టాఫ్ వైస్ చీఫ్



నిస్తార్ వెసల్‌లో జనరేటర్ ప్రారంభిస్తున్న వైస్ అడ్మిరల్ ఘోర్మడే

సాక్షి, విశాఖపట్నం : తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం పర్యటనకు వచ్చిన నేవల్ స్టాఫ్ వైస్ చీఫ్ వైస్ అడ్మిరల్ ఎస్ఎన్ ఘోర్మడే మంగళవారం హిందూస్థాన్ షిప్‌యార్డును సందర్శించారు. ఘోర్మడేని షిప్‌యార్డు సీఎండీ కమొడార్ హేమంత్ ఖత్రీ స్వాగతం పలికి.. అక్కడ జరుగుతున్న అభివృద్ధి, కార్యకలాపాలను వివరించారు. అనంతరం హెచ్ఎస్ఎల్‌లో నిర్మితమవుతున్న డైవింగ్ వెసల్ సపోర్ట్ వెహికల్ నిస్తారాను సందర్శించారు. స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతున్న ఈ వెసల్‌లో 2 మెగావాట్ల డీజిల్ జనరేటర్‌ను ఆయన ప్రారంభించారు. ఇటీవలే మరమ్మతులకు వచ్చిన ఐఎన్ఎస్ సింధుకీర్తి సబ్‌మెరైన్‌తో పాటు రష్యన్ జలాంతర్గామిని కూడా ఘోర్మడే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుల్ని సమర్థవంతంగా నిర్వహించే విషయంలో షిప్‌యార్డు పురోగతి ప్రశంసనీయమని కొనియాడారు. యార్డ్‌కు ఫ్లీట్ సపోర్ట్ షిప్ ఆర్డర్ లభిస్తే భవిష్యత్ స్వర్ణయుగంగా మారుతుందన్నారు.

28,29 తేదీల్లో జీ-20 'ఐడబ్ల్యూజీ' వర్క్‌షాపు

డాబాగార్డెన్స్: జీ–20 ఇండియా ప్రెసిడెన్సీలో భాగంగా రెండవ జీ–20 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్(ఐడబ్ల్యూజీ) సమావేశం ఈ నెల 28, 29 తేదీల్లో విశాఖపట్నంలో జరగనుంది. జన భాగీదారిలో భాగంగా డిపార్టుమెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్(డీఈఏ), హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వశాఖ, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఎఫ్‌సీ) సంయుక్తంగా నిర్వహించే రెండు రోజుల వర్క్‌షాపులో 'ఫైనాన్సింగ్ సిటీస్ ఆఫ్ టుమారో' అంశంపై చర్చించనున్నారు. ఈ వర్క్‌షాపుకు రాష్ట్రంలోని పలువురు మేయర్లు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ రాష్ట్రాల నుంచి పట్టణ, రాష్ట్ర విభాగాల ప్రతినిధులు, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ, గోవా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, లక్షద్వీప్, పుదుచ్చేరి నుంచి ప్రతినిధులు హాజరవుతారు. దేశంలోని నగరాలు, క్లిష్టమైన పట్టణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అభివృద్ధి చేయడమే ఈ వర్క్‌షాప్ లక్ష్యం.

నేడు, రేపు ప్రత్యేక సమావేశాలు

హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా, వరల్డ్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తదితర సంస్థల ప్రతినిధులతో బుధ, గురువారాల్లో వర్క్‌షాపులు జరగనున్నాయి. బుధవారం పౌర, మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం, ప్రైవేట్ ఫైనాన్సింగ్– అంతర్జాతీయ అనుభవాలు– పరిమితులు, వినూత్న ప్రాజెక్టుల తయారీ, అమలు, తదితర అంశాలపై ఐదు సెషన్లలో చర్చిస్తారు. గురువారం నగర వీధులు, సామర్థ్య నిర్మాణ అవసరాలు, క్రెడిట్ అసెస్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్, వే ఫార్వర్డ్–వివిధ మార్గాల్లో నిధులు, సలహాలు తదితర అంశాల్లో నాలుగు సెషన్లలో వర్క్‌షాపు కొనసాగుతుంది.

జీ-20 సదస్సు ఏర్పాట్లపై మేయర్ సమీక్ష

డాబాగార్డెన్స్: జీ–20 సదస్సు ఏర్పాట్లపై మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మంగళవారం అధికారులతో సమీక్షించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, ప్రధాన సిటీ ప్లానర్ బి.సురేష్‌కుమార్, అదనపు కమిషనర్లు ఎస్ఎస్ వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు, హార్టికల్చర్ డీడీ దామోదరరావు నుంచి జీ–20 పూర్తి వివరాలు అడిగి తెలుసుకుని కొన్ని సూచనలు చేశారు. సదస్సుకు దేశ విదేశాల నుంచి 200 మంది అతిథులు వస్తున్నారని.. వాటికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. నగరంలో మిగిలిన సుందరీకరణ పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్లను తొలగించాలని, భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్డు మార్జిన్లలో వేయకుండా నిఘా పెట్టాలన్నారు. విశాఖ తీరప్రాంతం మరింత ఆకర్షణీయంగా ఉండేలా చూడాలన్నారు.



ఆరోగ్య 'యోగ'ం



బీచ్‌రోడ్డు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అన్నారు. జీ–20 సదస్సు నేపథ్యంలో మంగళవారం ఎంజీఎం పార్క్‌లో యోగా సాధన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీ–20 సదస్సుకు వచ్చే అతిథులకు భారతీయ సంస్కృతిలో భాగమైన యోగాతో స్వాగతం పలకడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. నిత్యం యోగా చేయడం వల్ల యవ్వనంగా ఉండటంతో పాటు అన్ని ఆరోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పాటించడం ద్వారా ఆరోగ్యం, ఏకాగ్రత, చురుకుదనం పొందవచ్చన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు యోగా నేర్పించాలని ఉపాధ్యాయులను కోరారు. అదనపు కమిషనర్లు ఎస్ఎస్ వర్మ, వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

బీచ్ కారిడార్‌కు 'గ్రీన్' కార్పెట్

- భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానం చేస్తూ ప్రత్యేక కారిడార్
- కైలాసగిరి నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు 10 మీటర్ల వెడల్పున గ్రీన్ బెల్ట్
- అభివృద్ధికి భూమినిచ్చిన వారికి టీడీఆర్ ఇవ్వాలని నిర్ణయం
- అభ్యంతరాల స్వీకరణకు నోటిఫికేషన్

సాక్షి, విశాఖపట్నం : పరిపాలన రాజధాని నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సాఫీగా చేరుకునేలా ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. సాగరతీరంలో ప్రకృతితో ప్రయాణాన్ని ఆస్వాదిస్తూ ఎయిర్‌పోర్టుకి గంటలోపే చేరుకునేలా గ్రీన్‌ఫీల్డ్ రహదారిని మాస్టర్‌ప్లాన్ రోడ్డుగా నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. బీచ్ కారిడార్‌లో భాగంగా గ్రీన్ బెల్ట్ అభివృద్ధికి నోటిఫికేషన్ జారీ చేసింది. 33 అడుగుల మేర అభివృద్ధి చేయనున్న గ్రీన్‌బెల్ట్ కోసం భూమిని ఇచ్చే వారికి టీడీఆర్(ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏవైనా సలహాలు, సూచనలు, అభ్యంతరాలుంటే 15 రోజుల్లోగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు తెలియజేయాలని స్పష్టం చేసింది.

ప్రత్యేక రహదారికి ముందడుగు

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు పడుతున్న నేపథ్యంలో విశాఖ నుంచి భోగాపురం వెళ్లేందుకు ప్రత్యేక రహదారి నిర్మాణానికి ఒక్కో అడుగు పడుతోంది. ఇటీవల నగరంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కేంద్ర జాతీయ రహదారులు శాఖ మంత్రి నితిన్ గడ్కరీ బీచ్ కారిడార్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం దూకుడు పెంచింది. నగరంలో ఎన్‌హెచ్–16 ఉన్నప్పటికీ.. పెరుగుతున్న రద్దీ దృష్ట్యా మరో ప్రధాన రహదారి కచ్చితంగా అవసరమని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రహదారిని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల్ని ఆదేశించారు. దీనికి అనుగుణంగా రాజధానికి రాచమార్గంగా కోస్టల్ హైవే నిర్మాణానికి అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. బీచ్‌రోడ్డులో ఉన్న కోస్టల్ బ్యాటరీ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వరకు మాస్టర్‌ప్లాన్ రహదారిగా అభివృద్ధి చేయనున్నారు. ఎన్‌హెచ్ఏఐ, ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, వీఎంఆర్‌డీఏ, విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ), జీవీఎంసీ సహకారంతో బీచ్ కారిడార్‌ని అభివృద్ధి చేయనున్నారు. ఆయా ప్రాంతాల పరిస్థితులను బట్టి రహదారి నిర్మాణం చేపట్టాలని డీపీఆర్‌లో స్పష్టం చేశారు.

భూమికి తగిన టీడీఆర్ ఇస్తాం..

ఇందులో భాగంగానే కైలాసగిరి జంక్షన్ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకూ బీచ్‌కారిడార్‌లో ప్రతిపాదిత రైట్ ఆఫ్ వే(రో) అంచున గ్రీన్ బెల్ట్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ గ్రీన్ బెల్ట్ రానున్న 10 మీటర్ల మేర ఉన్న ప్రాంతంలో ఎవరివైనా భూములు ఉంటే.. ఆ భూ యజమానులు స్వయంగా ప్రభుత్వానికి అప్పగించినా.. లేదా.. వారే గ్రీన్‌బెల్ట్‌గా అభివృద్ధి చేసి ఇవ్వవచ్చని సూచించింది. ఎలా ఇచ్చినా సరే జీవో నం.223 ప్రకారం టీడీఆర్ పొందేందుకు అర్హులని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే.. ఐఎస్ఎస్ కళింగ, ఎర్రమట్టిదిబ్బలు, నీటి వనరులు, రెవెన్యూ రికార్డుల్లో ఉన్న కొండలు మొదలైన ప్రాంతాల్లో ఉన్న భూములకు గ్రీన్‌బెల్ట్ అంశాలు వర్తించబోవంటూ మంగళవారం జారీ చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధికి సంబంధించిన ప్రభుత్వం సమయానికి అనుగుణంగా తదుపరి నిర్ణయం తీసుకోనుందని స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి వెల్లడించారు. ఈ అంశాలపై ఎవరికైనా అభ్యంతరాలున్నా, సలహాలందించాలనుకున్నా నోటిఫికేషన్ జారీ చేసిన 15 రోజుల్లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్‌చీఫ్ సెక్రటరీకి తెలియజేయాలని సూచించారు.

ఏయూలో రేపు జాబ్‌మేళా

ఏయూక్యాంపస్: మోడల్ కెరీర్ సెంటర్, యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో ఏయూలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ నెల 23న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆచార్య పి.అర్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. కాన్సంట్రిక్స్ సంస్థలో వాయిస్ ఉద్యోగాలకు ఇంటర్, డిగ్రీ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. మొత్తం 25 ఖాళీలను భర్తీ చేస్తారని, 18 నుంచి 28 సంవత్సరాల వయసు కలిగిన వారు హాజరు కావచ్చని తెలియజేశారు. డెక్కన్‌ఫైన్ కెమికల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 250 ట్రైనీ కెమిస్ట్, సీనియర్ కెమిస్ట్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ, డిప్లొమా, బీటెక్ కెమికల్ పూర్తి చేసిన పురుష అభ్యర్థులు మాత్రమే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్తగా చేరిన వారికి నెలకు రూ. 19 వేల వరకు వేతనంగా, సీనియర్ కెమిస్ట్‌కు 3.5 లక్షలు వార్షిక వేతనంగా అందిస్తారని తెలియజేశారు. 18 నుంచి 27 సంవత్సరాల వయసు కలిగిన వారు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 96660 92491, 83670 48979 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హతియా–చెన్నై మధ్య స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హతియా–చెన్నై మధ్య వన్ వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. హతియా–చెన్నై(08042) వన్ వే స్పెషల్ ఈ నెల 25న తెల్లవారుజాము 4.50 గంటలకు హతియాలో బయలుదేరి అదేరోజు రాత్రి 8.43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.45 గంటలకు బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు చెన్నై వెళ్తుంది. ఈ వన్‌వే స్పెషల్ నువాగావ్, రూర్కెలా, ఝూర్సుగుడ, సంబల్‌పూర్, బర్‌గడ్ రోడ్, బాలంగీర్, టిట్లాఘడ్, కేసింగ, మునిగుడ, రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, దువ్వాడ, అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు స్టేషన్లలో ఆగుతుంది.

కాలువలో కొట్టుకుపోయి వృద్ధుడి మృతి



చీట్ల పైడయ్య మృతదేహం



పైడయ్య కొట్టుకుపోయిన కాలువ

పెదగంట్యాడ: మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా ఓ వృద్ధుడు కాలువలో కొట్టుకుపోయి మృతి చెందాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. దయాల్‌నగర్, సాయి బాబా ఆలయ ప్రాంతంలో చీట్ల పైడయ్య (60) కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో చుట్టలు కొనుక్కొని వస్తానని చెప్పి రూ.500 తీసుకుని.. హౌసింగ్ బోర్డు కాలనీలో జరిగే సంతకు బయలుదేరాడు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో ఆయన నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలోని ఓ కాలువలో కొట్టుకుపోవడం కనిపించింది. వెంటనే స్థానికులు 100కు కాల్ చేశారు. న్యూపోర్టు పోలీసులు, అగ్నిమాపక దళ అధికారులు, జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకోగా ఆ కాలువ వద్ద ఎవరూ కనిపించలేదు. మంగళవారం ఉదయం అయ్యన్నపాలెం వద్ద వృద్ధుడి మృతదేహాన్ని కనుగొన్నారు. అతని గురించి ఆరా తీసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన.. ఇలా తిరిగి రాని లోకాలకు వెళ్లిపోతాడని అనుకోలేదని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించేందుకు వెంపళ్లనగర్ అధ్యక్షుడు గళ్లా శంకర్‌సాయిరాం వాహనాన్ని ఏర్పాటు చేశారు. సంఘటన స్థలాన్ని న్యూపోర్టు సీఐ రాము, సిబ్బంది సందర్శించారు. పైడయ్యకు భార్య అంకమ్మ, కుమార్తెలు లక్ష్మి, జోగమ్మ, కుమారుడు లక్ష్మణ్ ఉన్నారు. భార్య అంకమ్మ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో విదేశీయుడి అరెస్ట్

గోపాలపట్నం: ఎస్‌ఏడీ జంక్షన్‌లో గంజాయితో ఓ విదేశీయుడు పట్టుబడ్డాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. రష్యాకు చెందిన వ్లాదిమిర్ ఒబ్రియన్ 30 ఏళ్లుగా గోవాలో నివాసం ఉంటున్నాడు. అక్కడ గంజాయికి అలవాటుపడ్డాడు. గోవాలో 10 గ్రాముల గంజాయి రూ.1500కు విక్రయిస్తుండటంతో.. చౌకగా దొరుకుతుందని విశాఖ వచ్చాడు. ఐదు కిలోల గంజాయి, పావు లీటర్ లిక్విడ్ గంజాయి కొనుగోలు చేశాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఎస్‌ఏడీ జంక్షన్‌లో తనిఖీలు చేపట్టారు. ఇక్కడ నుంచి గోవా వెళ్లేందుకు యత్నిస్తున్న సమయంలో అనుమానం వచ్చి అతని లగేజీ పరిశీలించారు. అతని బ్యాగులో గంజాయి గుర్తించి అరెస్ట్ చేశారు. అతనికి సహకరించిన గంట్యాడ అఖిల్ సాయి, కరిమిజ్జి జగదీష్, శివ అలియాస్ ఫిష్, శేషులను అదుపులోకి తీసుకున్నారు. రామకృష్ణ పరారీలో ఉన్నాడు. సౌత్ డీసీపీ కె.ఆనంద్‌రెడ్డి పర్యవేక్షణలో వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ బీడీఎస్ ప్రసాద్ ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.75కి టీటీడీ తెలుగు పంచాంగాలు

ఎంవీపీ కాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం అందుబాటులోకి తెచ్చిన తెలుగు పంచాంగాలను రూ.75కు విక్రయిస్తున్నట్లు టీటీడీ మేనేజర్ బి.హైమావతి వెల్లడించారు. ఈ మేరకు పంచాంగ ప్రతులను మంగళవారం ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆవిష్కరించారు. అనంతరం విక్రయాలు ప్రారంభించారు. స్టాక్ ఉన్నంత వరకు ఉదయం నుంచి టీటీడీ కల్యాణ మండపం వద్ద విక్రయిస్తామని హైమావతి వెల్లడించారు. కార్యక్రమంలో అధ్యాత్మికవేత్త సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం : భద్రత కారణాల దృష్ట్యా కేకే లైన్‌లో నడిచే పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నామని, ఆ రైళ్లు ఆయా తేదీల్లో దంతెవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు.

- విశాఖపట్నంలో ఈనెల 21, 28న బయల్దేరే విశాఖపట్నం – కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతెవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 22, 29న కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్ – విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్ దంతెవాడ నుంచి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నంలో ఈనెల 22, 29న బయల్దేరే విశాఖపట్నం – కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ రైలు దంతెవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 23, 30న కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్ – విశాఖపట్నం (08552) పాసింజర్ రైలు దంతెవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ప్రయాణికులు మార్పులను గమనించి సహకరించాలని రైల్వే అధికారులు కోరారు.

విమ్స్‌లో స్పైనల్ రిహేబిలిటేషన్ సెంటర్

రూ.2.60కోట్లతో ఏర్పాటుకు చర్యలు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్పైనల్ రిహేబిలిటేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు వెల్లడించారు. విమ్స్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విమ్స్ ప్రారంభించినప్పటి నుంచి పేదలకు నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఆర్థోపెడిక్, ఫిజియోథెరఫీ, న్యూరో, ఈఎన్‌టీ, జనరల్ సర్జన్, ఆప్తమాలజీ, కార్డియాలజీ తదితర విభాగాల ద్వారా వేల మందికి వైద్యం అందిస్తున్నామని చెప్పారు. రెండు నెలల కిందట ఏర్పాటు చేసిన పీఆర్‌పీ థెరపీ ద్వారా 70 మందికి ఉచితంగా చికిత్స అందించామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని విభాగాల్లో సర్జరీలు జరుగుతున్నాయన్నారు. మరికొద్ది రోజుల్లో విమ్స్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్పైనల్ రిహేబిలిటేషన్ ఏర్పాటు కానుందని.. వైద్యశాఖ ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం పరిశీలనకు ఈ అంశం తీసుకెళ్లినట్లు చెప్పారు. సుమారు రూ.2.60 కోట్లతో ఈ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పక్షవాతానికి గురై దీర్ఘకాలంగా బాధపడుతున్న వారికి, నడవలేని పరిస్థితిలో ఇంట్లో మంచం పట్టిన వారికి ఈ కేంద్రంలో వైద్య సేవలందించనున్నట్లు తెలిపారు. అలాగే ఫిజియోథెరఫీ విభాగాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే ఇక్కడ ఎలాంటి రుసుం తీసుకోకుండా ఫిజియోథెరఫీ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం విమ్స్‌లో రోజూ 500 నుంచి 600 మధ్యలో ఓపీ నమోదవుతోందని వెల్లడించారు.

ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట : జిల్లాలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ , పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు జేసీ కేఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో ఎన్నికల విధులలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు, సిబ్బందితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ , ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహణలో ప్రతి అధికారి, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేశారన్నారు. ఎన్నికల పరిశీలకులు సిద్దార్థ్ జైన్, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సమక్షంలో ఎన్నికల నిర్వహణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, శిక్షణ ఆర్డీవోలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేడు అప్పన్న పెళ్లిరాట

ఆలయంలో పంచాంగ శ్రవణం



సింహాచలం: ఉగాదిని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి పెళ్లిరాట (ఉడుపు రాట) మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, వైదికులు ఏర్పాట్లు చేశారు. వచ్చే నెల 2వ తేదీన జరిగే స్వామివారి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయ ఆస్థాన మండపంలో వైదిక కార్యక్రమాలు ప్రారంభిస్తారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై ఉంచి, తొలుత వైదికులు పంచాంగ పఠనం నిర్వహిస్తారు. అనంతరం ఆలయ ఉత్తర ద్వారం ప్రాంగణంలో, రాజగోపురం వద్ద, వార్షిక కల్యాణం నిర్వహించే నృసింహ మండపంలో ఉడుపు రాటలను వేస్తారు. తదుపరి ఉగాది పండిత సత్కారాలు నిర్వహిస్తారు.

మూల విరాట్‌ను తాకనున్న సూర్యకిరణాలు

ఏటా ఉగాది రోజు సాయంత్రం సూర్యకిరణాలు స్వామి వారి మూలవిరాట్‌ను తాకుతాయి. ఈ ఏడాది కూడా సాయంత్రం 4 గంటలకు అలా జరిగే ఆస్కారం ఉన్నందున అధికారులు సంబంధిత ఏర్పాట్లు చేశారు.

నేడు కళాభారతిలో సినీ సంగీత విభావరి

అల్లిపురం: సాయి ప్రియరాగ ప్రభ, భక్తి, లలిత, సినీ సాంస్కృతిక సంస్థ దశమ వార్షికోత్సవాన్ని మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో బుధవారం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి సూర్యప్రభ తెలిపారు. ఈ సందర్భంగా 'పాడనా తెనుగుపాట' పేరిట సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దశమ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆధ్యాత్మిక ప్రముఖులు, కళాకారులకు శోభకృత్ నామ సంవత్సర ఉగాది పురస్కారాలు అందజేయనున్నట్లు ఆమె వివరించారు.

మార్గదర్శి మేనేజర్ రామకృష్ణకు బెయిల్

విశాఖ లీగల్: మార్గదర్శి సీతంపేట బ్యాంచ్ సీనియర్ మేనేజర్ కామినేని రామకృష్ణకు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.తిరుమలరావు మంగళవారం బెయిల్ మంజూరు చేశారు. చిట్స్ అండ్ ఫైనాన్స్ కేసులో పలు అవకతవకలు జరిగినట్లు రిజిస్ట్రార్ జనరల్ సీఐడీ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో మూడో నిందితునిగా ఉన్న రామకృష్ణను సీఐడీ అధికారులు ఈనెల 13న అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. అనంతరం సీఐడీ అధికారుల విజ్ఞప్తి మేరకు రెండు రోజుల పాటు ప్రత్యేక విచారణ జరిపారు. ప్రభుత్వం తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎస్.రామమూర్తి నాయుడు, ఎ.శేషు, ముద్దాయి తరపున సీనియర్ న్యాయవాది ఎం.రవి తమ వాదనలు వినిపించారు.

ఇద్దరు మహిళా దొంగల అరెస్ట్

19 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీసీపీ నాగన్న

అల్లిపురం: తలుపులు వేసిన ఇళ్లలో, ఆటోల్లో ప్రయాణిస్తూ ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణాలు దొంగలిస్తున్న ఇద్దరు మహిళలను పెందుర్తి, ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.5.50 లక్షల విలువ చేసే సుమారు 19 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సూర్యాబాగ్, పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైం డీసీపీ గంధం నాగన్న వివరాలు వెల్లడించారు. న్యూ కరాసకు చెందిన బొండా నాగమణి(43), మడగాల సంధ్య (23) దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎయిర్‌పోర్టు జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న గోకెడ సంతోషి కుమారి రైల్వేలో ఉద్యోగం చేస్తున్నారు. ఆమె తనకు గల ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు ఇంట్లో గల షూట్‌కేసులో పెట్టారు. ఈ నెల 10న ఇంటి తాళం షూ రాక్‌లోని షూలో పెట్టి డ్యూటీకి వెళ్లిపోయారు. ఆమె సాయంత్రం 5.30 గంటలకు ఇంటికి వచ్చి చూడగా బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో ఆమె ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఈ నెల 10న, 22న సారిపల్లి సత్యనారాయణ, ఎస్.కె.హసీనాబీ ఆటోలో ప్రయాణిస్తుండగా బొండా నాగమణి, మడగాల సంధ్య వారితో పాటు ప్రయాణించి రెండు బ్యాగులు దొంగతనం చేశారు. వాటిలోని ఐదున్నర తులాల ఆభరణాలు అపహరించారు. పై రెండు ఘటనలకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. మరోవైపు గత నెల 28న సికింద్రాబాద్‌కు చెందిన జయంతి విజయలక్ష్మి ఆటోలో పెందుర్తి చేరుకున్నారు. ఆమె తన బ్యాగులో గల 8 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పై ఘటనలకు సారూప్యత ఉండడంతో నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు క్రైం ఏడీసీపీ డి.గంగాధరం, సీసీఎస్ ఏడీసీపీ డి.సూర్య శ్రావణకుమార్ ఉత్తర్వుల మేరకు వెస్ట్ క్రైం సీఐ కె.దుర్గా ప్రసాదరావు, ఎయిర్‌పోర్టు క్రైం సీఐ డి.కాంతారావు, పెందుర్తి క్రైం ఎస్.ఐ సల్మాన్ బేగ్ దర్యాప్తు చేపట్టారు. బొండా నాగమణి, మడగాల సంధ్య ఈ దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.